కాలనీల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


కాలనీ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి

వనస్థలిపురం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఎస్కేడినగర్ కాలనీలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ ముఖద్వారాన్ని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీవాసులు ఐక్యంగా ఉంటు కాలనీలను అభివృద్ధి చేసుకోవడం అభినందనీయం అన్నారు. తన సొంత నిధులతో ఆలయ ముఖద్వారాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయం అన్నారు. మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, అనిల్‌చౌదరి, సుమన్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, బుచ్చిరెడ్డి, సతీష్‌గౌడ్, సందీప్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు


బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం : ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సచివాలయనగర్ కాలనీలోని ప్రసిద్ధ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు కార్పొరేటర్ లచ్చిరెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కాలనీ అధ్యక్షుడు సాంబశివరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న డీసీపీకి సత్కారం


డీసీపీ ప్రవీణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్

ఎల్బీనగర్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్‌ను సోమవారం జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి సత్కరించారు. దాదాపు 20 నెలల పాటు ఎల్బీనగర్ డీసీపీగా విశిష్టమైన సేవలందించిన ప్రవీణ్‌కుమార్ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రత్యేక చొరవ కనబరిచారని రాజశేఖర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పల్సమ్ శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనాథ్‌రావు, రోహిత్ పాల్గొన్నారు.

కాలనీల్లోని సమస్యలపై దృష్టి పెట్టండి: బీజేపీ


కాలనీ సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీరకర్ణారెడ్డి, శివారెడ్డి తదితరులు

సరూర్‌నగర్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని అనేక కాలనీల్లో ఇటీవల కురిసిన వానలకు రోడ్లు పాడయ్యాయని, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారయిందని బీజేపీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా సమస్యలపై అధికారులు దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు సోమవారం బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ జి.శివారెడ్డి, బడంగ్‌పేట్ క్లస్టర్-2 అధ్యక్షుడు రామిడి వీరకర్ణారెడ్డి ఆధ్వర్యంలో పలు కాలనీల ప్రతినిధులు కమిషనర్ సరస్వతిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీల ప్రతినిధులు అరవింద్‌రెడ్డి, పాండుయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, ఇంద్రశేఖర్ పాల్గొన్నారు.

సదర్ ఉత్సవాలకు రూ.10కోట్లు కేటాయించాలి

సైదాబాద్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): సదర్ రాష్ట్ర పండుగగా ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఉత్సవాల నిర్వహణకు రూ.10కోట్లు కేటాయించాలని తెలంగాణ సదర్ ఉత్సవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మైల్‌కోల్ మహేందర్‌యాదవ్ కోరారు. సోమవారం సైదాబాద్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ఆవరణలో సదర్ ఉత్సవ సమితి రాష్ట్ర కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఉత్సవాలకు ప్రభుత్వం ప్రత్యేకంగా కమిటీ నియమించాలని డిమాండ్ చేశారు. యాదవ సంఘం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే స్వాగత వేదికకు ప్రభుత్వం మూడు లక్షల నగదు అందజేయాలని, కోరారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్‌యాదవ్, నాయకులు బత్తుల మహేందర్ యాదవ్, శ్రీశైలంయాదవ్, మాణిక్‌యాదవ్, నవీన్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ


శిక్షణకు హాజరైన ప్రిసైడింగ్ అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేయడంతో మండల అధికారులు ఎన్నికల నిర్వహణ పనిలో పడ్డారు. జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు సోమవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీవాణి నేతృత్వంలో అబ్దుల్లాపూర్‌మెట్‌లోని శివగార్డెన్‌లో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు, ఎంపీవో మధుసూదనచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలింగ్ రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు పోలింగ్ బూత్‌లో ఎన్నికల నిర్వహణ విధులపై ప్రిసైడింగ్ అధికారులు పలు సూచనలు చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొననున్న సుమారు 300మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించండి

- తహసీల్దార్‌కు సుర్మాయిగూడ గ్రామస్థుల వినతి


తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ దేవదాసుగౌడ్ తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలం లష్కర్‌గూడ గ్రామ పరిధి సుర్మాయిగూడలో శ్మశానవాటిక కోసం స్థలం కేటాయించాలని మాజీ జడ్పీటీసీ బింగి దేవదాసుగౌడ్ కోరారు. ఈ మేరకు సోమవారం దేవదాసుగౌడ్ గ్రామస్థులతో కలిసి తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుర్మాయిగూడలో శ్మశానవాటిక లేకపోవడంతో గ్రామంలో ఎవరైనా చనిపోయిన సమయంలో అంత్యక్రియలకు తీవ్ర ఇబ్బంది అవుతుందన్నారు. శ్మశానవాటిక కోసం 2ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే తహసీల్దార్‌కు ఫోన్‌చేసి వెంటనే శ్మశానవాటిక కోసం స్థలాన్ని కేటాయించాలని చెప్పినట్లు తెలిపారు. కార్యక్రమంలో రంగయ్య, శ్రీశైలం, అశోక్, మైసయ్య, పోచయ్య, రాములు, షరీఫ్‌మియా, యాదయ్య పాల్గొన్నారు.

గోసేవా ఫౌండేషన్ ప్రతినిధుల ముందస్తు అరెస్ట్


పోలీసుల అదుపులో గోసేవా ఫౌండేషన్ ప్రతినిధులు

సైదాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గోవుల రక్షణకు ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతున్నందుకు నిరసనగా గోసేవా ఫౌండేషన్ సచివాలయం ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో సైదాబాద్ పోలీసులు సోమవారం తెల్లవారు జామునుంచే ఫౌండేషన్ ప్రతినిధులను ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా గోసేవా ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి మాట్లాడుతూ తెలంగాణ గోశాలలో గోవులు లంపీ వ్యాధితో మృతిచెందుతుండగా ప్రభుత్వం చోద్యం చూస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి గోసంపద సంరక్షణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో ఫౌండేషన్ సభ్యులు మల్లేష్‌గౌడ్, లోకేష్‌యాదవ్, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.


మన్సూరాబాద్ పోచమ్మ ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, పీజే యాదవ్, రఘువీర్‌రెడ్డి


గ్రీన్‌హిల్స్‌కాలనీలో పూజల్లో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, విజయభారతి, దయాకర్‌రెడ్డి, లింగస్వామిగౌడ్, సత్యనారాయణరెడ్డి


ఆర్‌కేపురంలో పాల్గొన్న టీపీసీసీ ప్రతినిధి భాస్కర్‌రెడ్డి, మధుర ఉపేందర్‌రెడ్డి, పున్న గణేష్, ఆలయ చైర్మన్ రమేష్‌నేత, మార్కెట్ డైరెక్టర్ బండి మధుసూదన్


వినయ్‌నగర్ విజయ వినాయక ఆలయంలో మాతా కీ చౌకీ పూజకు హాజరైన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, హిందూ ధర్మ రక్ష ఫౌండర్ చీకోటి ప్రవీణ్

ఘనంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు

ఎల్బీనగర్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వాడవాడలా ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్‌కే పురం డివిజన్ గ్రీన్‌హిల్స్‌కాలనీలో సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారిని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, విజయభారతి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో దయాకర్‌రెడ్డి, లింగస్వామిగౌడ్, సత్యనారాయణరెడ్డి, సతీష్‌గౌడ్, మదన్‌మోహన్ పాల్గొన్నారు.

అల్మాస్‌గూడ దుర్గమ్మ సేవలో మాజీ మేయర్

సరూర్‌నగర్: అల్మాస్‌గూడ బస్టాండ్ కూడలిలో కొలువుదీరిన దుర్గమ్మను సోమవారం బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి దర్శించుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పి.సుదర్శన్‌రెడ్డి, ఏఐసీసీ విచార్ విభాగ్ కోఆర్డినేటర్ బి.రాఘవేందర్‌రెడ్డి, రామిడి కృష్ణారెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్, బోయపల్లి వెంకట్‌రెడ్డి, మల్గారి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.


మాతామైదానంలోని విజయదుర్గామాత ఆలయంలో నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పోచమ్మ ఆలయ మండపంలో ఎమ్మెల్యే పూజలు

మన్సూరాబాద్: మన్సూరాబాద్ డివిజన్ సీఆర్ ఎన్‌క్లేవ్‌కాలనీ సహారా రోడ్డులో గల పోచమ్మ ఆలయంలోని అమ్మవారి మండపంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పోచబోయిన జగదీష్‌యాదవ్, యువ నాయకుడు జక్కిడి రఘువీర్‌రెడ్డి, ఆలయ కమిటీ వైస్ చైర్మన్లు పోచబోయిన గణేష్‌యాదవ్, నాంపల్లి శంకరయ్య, సభ్యులు పాల్గొన్నారు.


సరస్వతీదేవి అలంకరణలో జీవనజ్యోతి సంఘంలోని జయదుర్గాదేవి

అన్నప్రసాద వితరణ..

మన్సూరాబాద్ పోచమ్మ ఆలయంలో అమ్మవారి మండపం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, ఆలయ చైర్మన్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ యువ నేత జక్కిడి రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు.

జైపురికాలనీలో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పూజలు

నాగోల్ డివిజన్ పరిధి జైపురికాలనీ సర్వే నం.58లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ వైశ్యఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పూజలు చేశారు.

సామూహిక అక్షరాభ్యాసములు

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆల యంలో సోమవారం మూలా నక్షత్రంను పురస్కరించుకొని సరస్వతిదేవి ఆలయంలో అమ్మవారికి అర్చకులు ప్రత్యేక అభిషేకములు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చిన్నారి బాలబాలికలకు సామూహిక అక్షరాభ్యాసములను వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో ఈవో ఎన్.లావణ్య, చైర్మన్ ఈదులకంటి సత్యనారాయణరెడ్డి, ధర్మకర్తలు, భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.


నాగోల్ జైపురికాలనీలో సర్వే నం.58లోని మండపం వద్ద భక్తులకు అన్నం వడ్డిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా


అల్మాస్‌గూడలో దుర్గామాతను దర్శించుకున్న మాజీ మేయర్ పారిజాతారెడ్డి, ఇతర నేతలు


హయత్‌నగర్ ముదిరాజ్‌కాలనీలో దుర్గామాతను దర్శించుకున్న బీఆర్ఎస్ నాయకుడు నక్క రవీందర్ గౌడ్, పారంద రమేష్, సింగిరెడ్డి మురళీధర్‌రెడ్డి


కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న బాలబాలికలు, కుటుంబ సభ్యులు

ఆరోగ్యకర జీవనశైలితో దీర్ఘాయుష్షు : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

- వరల్డ్ హార్ట్ డే 3కె వాక్‌థాన్

ఎల్బీనగర్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన జీవనశైలితో గుండె పదిలంగా ఉంటుందని తద్వారా సంతోషంగా ఎక్కువ కాలంగా జీవించవచ్చని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా ఓజోన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన 3కె వాక్‌థాన్‌ను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు వ్యాయామం చేస్తూ గుండెను కాపాడుకోవాలన్నారు. ఇటీవల కాలంలో చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరికి గుండెపోటు రావడం చూస్తూనే ఉన్నామన్నారు. రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ సాధారణ మోతాదులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఆస్పత్రి వైద్యులతో పాటు నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆవేర్ గ్లెనీగల్స్‌లో గుండె జబ్బులపై అవగాహన

వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకుని ఈ సంవత్సరం డోంట్ మిస్ ఎ బీట్ అనే థీమ్‌ను అనుసరిస్తూ బైరామల్‌గూడలోని ఆవేర్ గ్లెనీగల్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గుండె జబ్బులపై అవగాహన కల్పించారు. ప్రపంచ వ్యాప్తంగా మరణాలకు ప్రధాన కారణమైన గుండె సంబంధ వ్యాధులను సకాలంలో గుర్తించి ముందస్తు నివారణ చర్యలు చేపట్టడంపై ప్రచారం కల్పించడమే ఈ థీమ్ ముఖ్య ఉద్దేశమని ఆవేర్ గ్లెనీగల్స్ హాస్పిటల్ సీఓఓ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలితో గుండెను పదిలంగా కాపాడుకోవచ్చన్నారు. గుండె ఆరోగ్యం గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. సీనియర్ కార్డియాలజిస్టులు డాక్టర్ మళ్లీంద్రస్వామి, డాక్టర్ శ్రీఖర్, ఎలక్ట్రో ఫిజియాలజిస్ట్ డాక్టర్ విజయ్ సూరంపల్లి, కార్డియోథొరాసిస్ సర్జన్ అజయ్‌జోషి పాల్గొన్నారు.


వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఓజోన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో 3కె వాక్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఓజోన్ ఆస్పత్రి వైద్యులు

చేనేత కార్మికులకు రుణమాఫీ చేయాలి

- మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు


గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న చెరుపల్లి సీతారాములు, వనం శాంతికుమార్ తదితరులు

మన్సూరాబాద్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): దసరా పండుగలోగా చేనేత కార్మికులకు రుణమాఫీ చేయాలని మాజీ ఎమ్మెల్సీ, చేనేత కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు చెరుపల్లి సీతారాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేనేత పరిశ్రమలు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మన్సూరాబాద్‌లో సోమవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ముఖ్యఅతిథిగా చెరుపల్లి సీతారాములు విచ్చేసి మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత పరిశ్రమలు, అందులో పనిచేసే కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ మేరకు పలుమార్లు సీఎం రేవంత్‌రెడ్డి, సంబంధిత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కమిషనర్ శైలజారామయ్యర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. సమస్యలపై హామీలు ఇవ్వడం తప్ప పరిష్కార చర్యలు చేపట్టడం లేదని, దీంతో ఎంతో మంది కార్మికులకు ఆర్థిక సమస్యలు తలెత్తడంతో పాటు పలువురు తట్టుకోలేక ఆత్మహత్యలు సైతం చేసుకున్నారన్నారు. దసరాలోగా నేతన్నల రుణమాఫీ చేయాలని, చేనేతల సమస్యల పరిష్కారానికి తమ శాఖకు రూ.2వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమస్యలపై మన్సూరాబాద్ సహారా స్టేట్స్ వద్ద గల గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో చేనేత సంఘం నాయకులు చెరుకు స్వామి, ముషం నరహరి, వర్కాల చంద్రశేఖర్, పెంటయ్య, శేఖరయ్య, ఏలె వెంకటేశ్వర్లు, గజం శ్రీశైలం, గంగుల వెంకటేశం, దుస్స కుమార్, కర్నాటి రాములు, పురుషోత్తం పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి రూ.115కోట్లు

- మంత్రికి నేతల కృతజ్ఞతలు


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన శ్రీరాములుయాదవ్ తదితరులు

సరూర్‌నగర్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గంలోని పలు ప్రధాన రహదారుల అభివృద్ధికి కేంద్రం రూ.115కోట్లు మంజూరు చేయడం పట్ల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ ఆధ్వర్యంలో కందుకూరు మండలానికి చెందిన పార్టీ నాయకులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కిషన్‌రెడ్డితో పాటు చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి చొరవతోనే ఈ నిధులు మంజూరయ్యాయని ఈ సందర్భంగా శ్రీరాములుయాదవ్ పేర్కొన్నారు. రాచులూరు-చెర్లపటేల్‌గూడ రోడ్డుకు రూ.30కోట్లు, శ్రీశైలం హైవేలోని అవేర్ సంస్థ నుంచి లేమూరు మీదుగా తిమ్మాపూర్ వరకు గల రోడ్డుకు రూ.38కోట్లు, బేగంపేట్ నుంచి మాదాపూర్ మీదుగా ఎలిమినేడు వరకు గల రహదారికి రూ.17కోట్లు కేంద్రం నిధులను మంత్రి నితిన్ గడ్కరీ మంజూరు చేశారని అందెల చెప్పారు. మరో రూ.30కోట్లతో ఇప్పటికే మీర్‌ఖాన్‌పేట్-కొంగరకలాన్ రోడ్డు నిర్మాణం పూర్తయిందని ఆయన పేర్కొన్నారు. కేంద్రం నిధులతోనే శివారు గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు, లింకు రోడ్లు అభివృద్ధి చెందుతున్నాయని ఆయన అన్నారు. ఇందుకుగాను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు అందెల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, పార్టీ కందుకూరు మండల కమిటీ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, మాజీ ఎంపీపీ మందా జ్యోతీపాండు, జి.అమరేందర్‌రెడ్డి, మాదారం రమేశ్ గౌడ్ పాల్గొన్నారు.

మద్యం కోసం వస్తే రాత్రి వేళ దారిదోపిడీ

- సింగరేణికాలనీలో వరుస ఘటనలు

సైదాబాద్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ సింగరేణి కాలనీ బస్తీలో రాత్రివేళల్లో విచ్చలవిడిగా దొరుకుతున్న మద్యంతో దారిదోపిడీలు తరుచుగా జరుగుతున్నాయి. కొందరు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తుండగా.. మరికొందరు భయంతో, ఎందుకు వచ్చిన గొడవ అంటూ మిన్నకుండిపోతున్నారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరతున్నారు. తాజాగా బెల్ట్‌షాపులో మద్యం కోసం సింగరేణికాలనీ గుడిసెలకు వచ్చిన ఇద్దరు యువకులను ఆ గంతకులు అడ్డగించి దాడిచేసి పర్సులో దాచిన నగదు రూ.3800, ఫోన్ గుంజుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎల్బీనగర్ చంద్రపురికాలనీకి చెందిన ఆటోడ్రైవర్ మల్కాని రాజు(27) శనివారం రాత్రి సింగరేణి కాలనీ గుడిసెల్లో ఉన్న బెల్ట్‌షాపుల్లో మద్యం కొనేందుకు స్నేహితుడితో కలిసి బైక్‌పై వచ్చాడు. ఆ సమయంలో పోలీసులు రాగా రాజు స్నేహితుడు బైక్ ముందుకు వెళ్లిపోయాడు. రాజు ఒక్కడే ఉండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారు. రాజుపై దాడి చేసి పర్సు, ఫోన్ బలవంతంగా లాక్కున్నారు. పర్సులో నగదు రూ.3800, ఆధార్, ఏటీఎం కార్డులు తీసుకున్నారు. కనీసం ఫోన్ ఇవ్వమని ఆగంతకులను బతిమాలాడాడు. రూ.500 ఇస్తేనే ఫోన్ ఇస్తామని చెప్పారు. దీంతో రాజు తన స్నేహితుడు అఖిలేష్‌కు ఫోన్‌చేస్తూ రూ.500 ఆన్‌లైన్ చేయమని చెబుతూ చాకచక్యంగా లైవ్ లోకేషన్ పెట్టాడు. పరిస్థితిని అర్థం చేసుకున్న అఖిలేష్ వెంటనే బైక్‌పై మరో స్నేహితుడిని తీసుకుని లైవ్ లోకేషన్ ద్వారా ఘటనా స్థలానికి చేరుకున్నాడు. వారిని చూసిన ఆగంతకులు అక్కడి నుంచి పారిపోయారు. వెంటనే డయల్ 100కు సమాచారమివ్వగా పోలీసులు చేరుకున్నారు. కేసు నమోదు చేసుకున్న సైదాబాద్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీ ఆధారంగా ఇద్దరు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నిందితుల్లో ఒక బాలుడు ఉన్నట్లు సమాచారం.

తమ్ముడిని హత్య చేసిన అన్న అరెస్టు

చంపాపేట, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): హఫీజ్‌బాబానగర్ సీ బ్లాక్‌లో శుభ కార్యక్రమానికి పిలువలేదని ప్రశ్నించిన గొడవలో తమ్ముడిని కత్తితో హత్య చేసిన అన్నను ఆదివారం రాత్రి కంచన్‌బాగ్ పోలీసులు అరెస్టు చేశారు. హఫీజ్‌బాబానగర్‌లోని సీ బ్లాక్‌లో నివాసం ఉంటున్న షేక్ ముక్తార్(34) ఈనెల 27న రాత్రి అతని అన్న షేక్ ఈస్సా(36) మధ్య ఇటీవల జరిగిన శుభకార్యానికి తనను ఎందుకు పిలువలేదని వారి తల్లీ వద్ద గొడవ జరిగింది. దీంతో షేక్ ఈస్సా కోపంతో తమ్ముడిని కత్తితో చాతిలో పొడిచి పారిపోయాడు. దీంతో అతను ఆస్పత్రికి తీసుకెళ్లే లోపు మృతిచెందిన విషయం విధితమే. షేక్ ఈస్సాను అతని ఇంటి వద్ద అరెస్టు చేసి సోమవారం రిమాండ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్ తెలిపారు. చంద్రాయణగుట్ట అదనపు డీసీపీ కె.శ్రీకాంత్, ఏసీపీ ఎ.సుధాకర్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసుకొని నిందితుడిని అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కేసులో నిందితుడిని త్వరితగతిన అరెస్టు చేయడంలో కృషిచేసిన ఎస్ఐలు కృష్ణకాంత్, కె.రాజు, ఎం.శ్రీకాంత్, సిబ్బందిని వారు అభినందించారు.


నాగోల్ డివిజన్ లలితానగర్‌లో సద్దుల బతుకమ్మలతో మహిళలు


ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ కార్యాలయంలో సంబరాల్లో మహిళా ఉద్యోగులు, డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి


సైదాబాద్ సరస్వతినగర్‌లో బతుకమ్మ ఉత్సవాల్లో చిన్నారి

పంచాయతీ ఎన్నికల సందడి

- అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని గ్రామాల్లో ఎన్నికల జోష్
- మండలంలో రెండవ విడతలో ఎన్నికలు
- 14 గ్రామాలు, 8 ఎంపీటీసీ, 1 జడ్పీటీసీ స్థానం
- మొత్తం ఓట్లు 35,585

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు గ్రామ పంచాయతీ ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సోమవారం స్థానిక ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీంతో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో ఎన్నికల జోష్ మొదలైంది. మండలంలో రెండవ విడతలో పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయి. మండలంలో మొత్తం 14గ్రామ పంచాయతీలు, 1 జడ్పీటీసీ, 8 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. 14గ్రామాల్లో మొత్తం 35,585 ఓట్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను మండల అధికారులు పూర్తిచేశారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు రిజర్వేషన్ల ప్రక్రియ కూడా అధికారులు పూర్తి చేశారు. ఇక స్థానిక సమరమే మిగిలింది.

రెండవ విడతలో ఎన్నికలు..

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మండలాల్లో రెండవ విడతలో పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయి. అక్టోబరు 13 నుంచి 15వ తేదీ వరకు ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ, 16న నామినేషన్ల పరిశీలన, 19న అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. 27న ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ జరుగనుంది. నవంబర్ 11వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగనుంది. అక్టోబరు 21 నుంచి 23వ తేదీ వరకు సర్పంచ్, వార్డు అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ, 24న నామినేషన్ల పరిశీలన, 27న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు మధ్యాహ్నం 3గంటల తర్వాత ఎన్నికల్లో పోటీ అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. నవంబర్ 4వ తేదీన ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఎన్నికల పోలింగ్ జరుగనుంది. మధ్యాహ్నం 2గంటల తర్వాత సర్పంచ్, వార్డు అభ్యర్థుల ఓట్లను లెక్కించి ఫలితాలు వెల్లడించనున్నారు.

గ్రామాల వారీగా సర్పంచ్, ఎంపీటీసీ రిజర్వేషన్ల వివరాలు

మండల ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు జనరల్ మహిళకు కేటాయించారు.

సర్పంచ్ స్థానాలు 14

అబ్దుల్లాపూర్‌మెట్(బీసీ-మహిళ), అనాజ్‌పూర్(ఎస్సీ-మహిళ), బలిజగూడ(జనరల్-మహిళ), బండరావిరాల(ఎస్సీ-జనరల్), చిన్నరావిరాల(బీసీ-మహిళ), గండిచెరువు(జనరల్), గుంతపల్లి(జనరల్-మహిళ), ఇనాంగూడ(జనరల్-మహిళ), జాఫర్‌గూడ(బీసీ-జనరల్), కవాడిపల్లి(బీసీ-జనరల్), లష్కరగూడ(బీసీ-జనరల్), మజీద్‌పూర్(బీసీ-మహిళ), పిగ్లీపూర్(జనరల్), బాటసింగారం(జనరల్)

ఎంపీటీసీ స్థానాలు 8

అబ్దుల్లాపూర్‌మెట్-1(జనరల్), అబ్దుల్లాపూర్‌మెట్-2(జనరల్), అనాజ్‌పూర్(బీసీ), బండరావిరాల(జనరల్-మహిళ),కవాడిపల్లి(జనరల్-మహిళ), లష్కర్‌గూడ(ఎస్సీ), మజీద్‌పూర్(బీసీ), బాటసింగారం(బీసీ-మహిళ)కు కేటాయించారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | రాజు : 99854 02786